సాక్షి
ఖమ్మం
మంగళవారం । 5 । నవంబర్ । 2024



ప్రశ్నార్థకంగా ఆయకట్టు
వందనం – కొదుమూరు ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు రావడంతో నీటి విడుదల ప్రశ్నార్థకంగా మారింది. 8లో



క్రీడాజట్ల ఎంపిక
రాష్ట్రస్థాయి పోటీల కోసం ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్, రగ్బీ, అండర్ – 14, 17 జట్లను ఖమ్మంలో ఎంపిక చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 20°

వాతావరణం
జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. సాయంత్రం కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశముంది.

గింజ కూడా కొనలే..

ఈ వానాకాలం సీజన్‌లో సాగు చేసిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులకు ఆదిలోనే అవస్థలు ఎదురవుతున్నాయి. ముందుగానే కేంద్రాలు తెరిచి కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వ ప్రకటనలకు భిన్నంగా క్షేత్రస్థాయి పరిస్థితులు ఉన్నాయి. అట్టహాసంగా కేంద్రాలను తెరిచినట్లు ప్రకటిస్తున్నప్పటికీ రోజులు దాటుతున్నా కొనుగోళ్లు మొదలుకావడం లేదు. ఇప్పటి వరకు జిల్లాలో తెరిచిన కొనుగోలు కేంద్రాలకు సంబంధించి మిల్లర్ల కేటాయింపులో జాప్యం జరగడంతో ధాన్యంతో వచ్చిన రైతులు ఎదురుచూస్తున్నారు. ఉదయమంతా ఆరబోయడం.. రాత్రి కాగానే కుప్పలు చేసి టార్పాలిన్లు కప్పడం నిత్యకృత్యమైంది. మరోపక్క జిల్లాలో ఎప్పుడు వర్షం పడుతుందో తెలియని పరిస్థితుల్లో అధికారులు ప్రభుత్వ కొనుగోళ్లకు నిర్ణయించిన స్థలాల్లోనే ప్రైవేట్ వ్యాపారులకు పలువురు ధాన్యం అమ్ముతుండడం గమనార్హం. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం 'సాక్షి' పరిశీలించగా వెల్లడైన అంశాలు ఇలా ఉన్నాయి. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం/సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లి మండలం అయ్యగారిపేటలో ధాన్యాన్ని బస్తాల్లోకి ఎత్తిస్తున్న ప్రైవేట్ వ్యాపారి

ధాన్యంతో కేంద్రాల్లో రైతుల పడిగాపులు

- మిల్లర్ల కేటాయింపులో ఆలస్యంతోనే ఈ పరిస్థితి
- వర్షం భయం.. సౌకర్యాల లేమితో ఆందోళన
- విధిలేని పరిస్థితుల్లో వచ్చిన ధరకే వ్యాపారులకు అమ్మకం
- ప్రభుత్వం ఎంపిక చేసిన స్థలాల్లోనే 'ప్రైవేట్' అమ్మకాలు, ఎగుమతి!

తెరిచినా కొనుగోళ్లు లేవు..

జిల్లాలో ఈ వానాకాలం ధాన్యం సేకరణ కోసం 323 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించారు. ఇందులో సన్నధాన్యం కొనుగోళ్లకు 268, దొడ్డు రకం ధాన్యానికి 55 కేంద్రాలు ఏర్పాటుచేయాల్సిఉంటుంది. మొత్తంగా 176 కేంద్రాలనే ఇప్పటివరకు తెరవగా, ఇందులో పీఏసీఎస్‌ల ఆధ్వర్యాన 84, ఐకేపీ 67, డీసీఎంఎస్ కేంద్రాలు 25 ఉన్నాయి. అయితే ఈ కేంద్రాలను తెరిచినట్లు చెబుతున్నా ఇప్పటివరకు గింజ ధాన్యం కూడా కొనుగోలు చేయలేదు. కేంద్రాలను తెరిచారనే సమాచారంతో రైతులు ధాన్యం తీసుకొచ్చి రోజులు దాటుతున్నా కొనుగోళ్లు చేపట్టకపోవడంతో వర్షం భయంతో ఆందోళన చెందుతున్నారు.



వెలవెలబోతున్న నేలకొండపల్లి మండలం చెరువుమాదారంలోని కేంద్రం

- నేలకొండపల్లి మండలంలోని చెరువు మాదారంలో ఐకేపీ ఆధ్వర్యాన గత నెల 26న కేంద్రాన్ని ప్రారంభించినా కొనుగోళ్లు మాత్రం చేయలేదు. తేమ ఎక్కువగా ఉందని, ఇతర కారణాలు చెబుతుండడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారుల వైపు మొగ్గుచూపుతున్నారు. రాజేశ్వరపురం, నేలకొండపల్లి, పైనంపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.

ఎప్పుడు కొంటారు?

దాదాపు జిల్లా అంతటా వరి కోతలు మొదలుకాగా, తొలుత కోసిన రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాలకు తీసుకొస్తున్నారు. గోనె సంచులు, ఇతర ఏర్పాట్లు చేసినా మిల్లర్ల కేటాయింపు జరగకపోవడమే ధాన్యం కొనుగోలు చేయకపోవడానికి కారణంగా తెలిసింది. జిల్లాలో 66 రైస్ మిల్లులు ఉండగా, ఈసారి ప్రభుత్వం నిబంధనల్లో మార్పులు చేసింది. వీటిపై మిల్లర్ల అభ్యంతరంతో కేటాయింపు పూర్తికాలేదని సమాచారం. ఈ నేపథ్యాన ఇంకా ఎన్ని రోజులు ఎదురచూడాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.

- సత్తుపల్లి మండలం అయ్యగారిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గత నెల 28న ప్రారంభించారు. ఇక్కడ సుమారు 500 బస్తాల ధాన్యం ఆరబోసి ఉండగా గింజ కూడా కొనలేదు. ఓ పక్క వర్షం భయం, మరోపక్క పడిగాపులు కాయలేక రైతులు అక్కడే ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

సాక్షి విజిట్

- వేంసూరు మండలంలో పీఏసీఎస్‌లు, ఐకేపీ ఆధ్వర్యాన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా రైతులు ప్రైవేట్ వ్యాపారులకే అమ్ముతున్నారు. పొలాల వద్దే ధాన్యం బస్తాకు రూ.1,500 చెల్లిస్తుండడంతో రవాణా ఖర్చులైనా మిగులుతాయని ఇచ్చేస్తున్నారు.
- కల్లూరు మండలంలో ఇప్పటివరకు 17 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ఎక్కడా ధాన్యం కొనలేదు. గన్నీ బస్తాలు రాకపోవడంతో కొనుగోళ్లు ప్రారంభించలేదని నిర్వాహకులు చెబుతున్నారు. పుల్లయ్యబంజరు కేంద్రంలో సుమారు 5 వేల క్వింటాళ్ల సన్నరకం ధాన్యం ఆరబోశారు. వర్షం కురిస్తే పరిస్థితి ఏమిటనే ఆందోళనతో రైతులు రాత్రింబవళ్లు కాపలా కాస్తున్నారు.
- కూసుమంచి మండలానికి కేటాయించిన 12 కేంద్రాల్లో ఐదు ప్రారంభమైనా కొనుగోళ్లు చేపట్టలేదు. పాలేరులోని ఐకేపీ కేంద్రానికి రైతులు 3వేల బస్తాల ధాన్యాన్ని తీసుకొచ్చారు. గన్నీ బ్యాగులు, హమాలీలు సిద్ధంగా ఉన్నా మిల్లు కేటాయించకపోవంతో రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోంది.

"వ్యాపారులకు విక్రయిస్తున్నాం..



సొసైటీ కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి ఐదు రోజులైనా కొనలేదు. కాంటాలు, సంచులు లేకపోగా వర్షం వచ్చేలా ఉండడంతో ఏం చేయాలో తెలియడం లేదు. దీంతో ఆరబోసిన ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు బస్తా రూ.1,440 చొప్పున విక్రయిస్తున్నాం. మాలాంటి రైతులకి ఇది చెప్పుకోలేని దెబ్బ.
– కారుమంచి సురేష్, రైతు, సత్తుపల్లి

రోజులుగా పడిగాపులు..



పది రోజుల క్రితం కేంద్రానికి ధాన్యం తీసుకొస్తే కనీసం కాంటా కూడా వేయలేదు. ఎప్పుడు వాన వస్తుందోనని భయంగా ఉంది. ధాన్యం ఆరబోయడం, సాయంత్రానికి కుప్ప నూర్చి ఇక్కడే నిద్రిస్తున్నాం. 400 బస్తాలు ఇలా చేయాలంటే కష్టంగా ఉంది. కాంటాలు వేస్తే మా కష్టాలు పోతాయి.
– ఎడవల్లి సత్యనారాయణ రెడ్డి, రైతు, పాలేరు

నేటి నుంచి కొనుగోళ్లు చేస్తాం..

ఇప్పటికే తెరిచిన కేంద్రాల్లో నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు చేస్తాం. ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్లే కొనుగోళ్లు చేయలేదు. కొనుగోళ్లకు సంబంధించి జిల్లాలో మిల్లర్ల కేటాయింపు కూడా పూర్తయింది. ఇకపై జాప్యం లేకుండా, ఇబ్బంది ఎదురు కాకుండా ధాన్యం కొనుగోలు చేస్తాం.
– చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారి

న్యూస్‌రీల్

జమలాపురం ఆలయంలో కార్తీక పూజలు



భక్తులతో వ్రతం చేయిస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు వచ్చారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు దీపాలను వెలిగించగా, యాగశాలలో నిర్వహించిన సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతంలో 20 జంటలు పాల్గొన్నాయి. ఈఓ కొత్తూరు జగన్‌మోహన్ రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధక్షేత్రం అభివృద్ధికి రూ.2.50 కోట్లు



భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఈ సరిత, అధికారులు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని బౌద్ధక్షేత్రం అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేసిందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎస్‌ఈ సరిత వెల్లడించారు. బౌద్ధక్షేత్రాన్ని సోమవారం సందర్శించిన ఆమె రూ.50 లక్షలతో నిర్మించిన విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు. ఇక్కడ మిగిలిన పనులను పూర్తి చేయాలని ఆదేశించిన ఎస్‌ఈ, నూతనంగా చేపట్టే అభివృద్ధి పనులకు కేటాయించిన రెండు ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన నిధులతో రెండెకరాల్లో పార్క్ ఏర్పాటుతో పాటు ఇతర పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. జిల్లా టూరిజం అధికారి బి.సుమన్ చక్రవర్తి, ఏఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కమిషన్ పర్యటన వాయిదా

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం కలెక్టరేట్‌లో మంగళవారం జరగాల్సిన బీసీ కమిషన్ సమావేశం వాయిదా పడిందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల్లో వెనుకబాటుతనం స్వభావం, తదితర అంశాలపై విచారణ చేపట్టి వినతులు స్వీకరించడానికి మంగళవారం కమిషన్ చైర్మన్, సభ్యులు వస్తారని తొలుత వెల్లడించారు. ఈమేరకు ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఖమ్మం కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేస్తుండగా, కమిషన్ పర్యటన వాయిదా పడిందని కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వం మళ్లీ షెడ్యూల్ ప్రకటించాక వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

సమగ్ర కుటుంబ సర్వేకు 1,500మంది టీచర్లు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల నుంచి 1,500మంది ఉపాధ్యాయులను సమగ్ర కుటుంబ సర్వేకు కేటాయించారు. ఈనెల 6వ తేదీ నుంచి 15రోజుల పాటు సర్వే జరగనుంది. ఉపాధ్యాయుల కేటాయింపుతో ప్రాథమిక పాఠశాలలను ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తారు. జిల్లాలోని 816ప్రాథమిక పాఠశాలల్లో 1,600మంది ఉపాధ్యాయులకు గాను 1,500మంది సర్వే కోసం కేటాయించడంతో ఒకటే పూట పాఠశాలలు నిర్వహిస్తారు. ఇక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు యథావిధిగా కొనసాగుతాయని డీఈఓ సోమశేఖరశర్మ వెల్లడించారు.

రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలకు 248 మంది



బస్సులను ప్రారంభిస్తున్న అధికారులు

పాల్వంచరూరల్: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో మంగళవారం నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాలకు భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని విద్యార్థులు 248మంది సోమవారం బయలుదేరారు. ఇందులో 124మంది బాలురు, 124 మంది బాలికలు ఉండగా.. వీరికి కిన్నెరసాని, కాచనపల్లి స్పోర్ట్ స్కూళ్లలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఆయా శిబిరాల నుంచే బస్సుల్లో ఉట్నూరు బయలుదేరారని ఐటీడీఏ స్పోర్ట్స్ ఆఫీసర్ బి.గోపాల్ రావు తెలిపారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: సీసీ రోడ్ల నిర్మాణ పనులలో నాణ్యత పాటించాలని, తద్వారా పదికాలాల పాటు మన్నికగా ఉంటాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఖమ్మం 18వ డివిజన్ శ్రీరామ్‌నగర్‌లో టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంచనాల్లో పొందుపర్చిన విధంగా నిర్మాణంలో నాణ్యత పాటించాలని, ఈ విషయమై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, ఆదనపు కలెక్టర్ శ్రీజ, కార్పొరేటర్లు మందడపు లక్ష్మి, మనోహర్, కమర్తపు మురళి, మేడారపు వెంకటేశ్వర్లు, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, ఈఈ కృష్ణలాల్ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి అటవీ అనుమతి ఇవ్వండి

భద్రాద్రి జిల్లాలోని తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో మంజూరైన రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు జారీ చేయాలని రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, అటవీ పర్యావరణ శాఖ కార్యదర్శికి రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. త్వరగా అనుమతులు జారీ చేస్తే యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టేందుకు వీలుంటుందని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో రహదారుల నిర్మాణంతో రవాణా వ్యవస్థ మెరుగై ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో సమస్యలు తీరతాయని ఆ లేఖలో పేర్కొన్నారు.

ఇళ్ల మంజూరులో పారదర్శకత

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన, అధికారులతో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా పారదర్శకంగా ఎంపిక చేపడుతామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 59వ డివిజన్ దానవాయిగూడెంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులు రూ.25 లక్షలతో నిర్మించనున్న డ్రెయినేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలకు ఇళ్ల కేటాయింపును విస్మరించిందని.. తమ ప్రభుత్వం మాత్రం గ్రామసభల ద్వారా ఇళ్ల మంజూరుకు అర్హులను ఎంపిక చేయనుందని తెలిపారు. గతంలో నిర్మాణం ప్రారంభించి వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులు కూడా పూర్తిచేసి లబ్ధిదారులకు కేటాయిస్తామన్నారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, ఆర్డీఓ నర్సింహారావు, కేఎంసీ ఈఈ కృష్ణలాల్, డీఈ మాధవిదేవి, ఏఈ కుమారస్వామి, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు లేకపోయినా ఓకే..

కూసుమంచి: తొలి విడతలో రేషన్‌కార్డులు లేకున్నప్పటికీ అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర మంత్రి పొంగులేటి తెలిపారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో తిరుమలాయపాలెం మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. గ్రామాల వారీగా సమస్యలను తెలుసుకుని పరిష్కారంపై సూచనలు చేశాక మాట్లాడారు. తొలి విడతలో స్థలం ఉండి ఇల్లు లేని వారికి మంజూరు చేస్తామని, ఈక్రమంలో అర్హులకు రేషన్ కార్డు లేకపోయినా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఆతర్వాత రేషన్ కార్డులు కూడా జారీ చేసి రెండో విడతలో రేషన్ కార్డు ఉంటేనే ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. కాగా, గ్రామాల్లో అర్హులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు, నాయకులు చొరవ చూపాలని, అనర్హులకు లబ్ధి జరిగినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు స్థానికంగానే నివాసముండాలని మంత్రి ఆదేశించారు. అలాగే, పనిచేయాలంటే డబ్బులు ఇవ్వాలని ప్రజలను వేధించొద్దని పొంగులేటి హితవు పలికారు.

గ్రీవెన్స్ దరఖాస్తులకు ప్రాధాన్యత

- ఎప్పటికప్పుడు పరిశీలన, పరిష్కారం
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: ప్రజావాణి(గ్రీవెన్స్ డే)లో అందే దరఖాస్తులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. ప్రజావాణిలో భాగంగా కలెక్టరేట్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ మండల పరిధిలో ప్రజావాణిలో అందే దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించి ప్రతీ శుక్రవారం సమీక్షించాలని సూచించారు. అలాగే, కలెక్టరేట్‌కు అందే దరఖాస్తుల విషయంలో ఇదే విధానం అవలంబించాలని తెలిపారు.

సర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు

ఈనెల 6న మొదలుకానున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పొరపాట్లకు తావివ్వకుండా పక్కాగా పూర్తిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో 6,33,304 కుటుంబాలు ఉండగా, 3,654 ఎన్యూమరేషన్ బ్లాక్‌గా విభజించి 3,719 మంది ఎన్యూమరేటర్లు, 314 మంది సూపర్‌వైజర్లు, ఐదుగురు అధికారులను నియమించామన్నారు. ఒక్కో ఎన్యూమరేట్‌కు 150 ఇళ్లు కేటాయించినందున రోజువారి లక్ష్యం విధించుకుని పూర్తిచేయాలని కలెక్టర్ సూచించారు.



ప్రజావాణిలో ఫిర్యాదు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

సరిహద్దు ప్రాంతాల్లో గట్టి నిఘా

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం మొదలైనందున అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పక్కరాష్ట్రం నుంచి ధాన్యం రాకుండా సరిహద్దుల్లో 14 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, అక్కడ పటిష్టమైన నిఘా ఏర్పాటుచేయాలని సూచించారు. అలాగే, సమస్యలు ఉంటే 1077 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించాలని, కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం 24 గంటల్లోగా రవాణా అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీఆర్వో ఎం.రాజేశ్వరి, డీఆర్డీఓ సన్యాసయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెల్లెమ్మా.. టీ స్టాల్ ఎలా నడుస్తోంది?

మహిళలు ఆసక్తి ఉన్న రంగంలో ఆర్థికంగా రాణించేలా ఇందిరా మహిళా శక్తి పథకం అండగా నిలుస్తుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కలెక్టరేట్ ఎదుట బస్టాప్ వద్ద ఇందిరా మహిళాశక్తి సహకారంతో ఏర్పాటుచేసిన 'స్త్రీ టీ స్టాల్'ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలితో మాట్లాడిన ఆయన 'చెల్లెమ్మా చాయ్ సెంటర్ ఎలా నడుస్తోంది, వ్యాపారం అనుకూలంగా ఉందా' అని ఆరా తీయడంతో పాటు టీ చేయించుకుని తాగారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా, వ్యాపార అభివృద్ధికి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందా అని తెలుసుకున్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం కుటుంబాల ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తుందని, స్వయం సహాయక గ్రూపుల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



టీ తాగుతూ నిర్వాహకురాలితో మాట్లాడుతున్న కలెక్టర్

హైవే అలైన్‌మెంట్‌పై ఆందోళన

పత్రాలతో ప్లాట్ల యజమానుల పడిగాపులు

రఘునాథపాలెం: రఘునాథపాలెం రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 218 మీదుగా నాగపూర్ – అమరావతి జాతీయ రహదారి వెళ్లనుండడంతో తమకు ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలాలు ఉంటాయా, పోతాయా అని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ప్లాట్ల యజమానులు కలెక్టర్‌ను కలిసి విన్నవించగా తహసీల్దార్ లూథర్ విల్సన్ ఆధ్వర్యాన సర్వే చేపట్టారు. శనివారం మొదలైన ఈ సర్వే సోమవారం కూడా కొనసాగగా బుధవారంకల్లా భూసేకరణపై స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. అయితే, సర్వే జరుగుతోందని తెలియడంతో పలువురు ప్రభుత్వం గతంలో తమకు కేటాయించిన పత్రాలతో ప్లాట్ల వద్ద పడిగాపులు కాస్తూ కనిపించారు. హైవే కోసం తమ భూములు సేకరించాల్సి వస్తే మరోచోట స్థలం కేటాయించి న్యాయం చేయాలని కనిపించిన వారినల్లా వేడుకున్నారు.



జెండా పాతిన ప్లాట్‌లో లబ్ధిదారులు

ఖమ్మంలోని గుంటు మల్లన్న క్షేత్రంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



కార్తీక పూజలు

కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామునే ఆలయాలకు చేరుకున్నభక్తులు దీపాలు వెలిగించారు.

క్లుప్తంగా

డీఎంహెచ్‌ఓను కలిసిన టీఎన్జీవోస్ నాయకులు



డీఎంహెచ్‌ఓకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

ఖమ్మంవైద్యవిభాగం: ఇటీవల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కళావతిబాయిని టీఎన్జీవోస్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీఎన్జీవోస్, మెడికల్ జేఏసీ నాయకులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా రాములునాయక్

ఖమ్మంక్రైం: విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ ఎన్నికయ్యారు. ఖమ్మంలోని విశ్రాంత పోలీసు అధికారుల సంఘం కార్యాలయంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.రాధాకృష్ణమూర్తి రుద్ర వెంకటనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాక్స్ విజన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యాన సభ్యులకుకంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం సైబర్ క్రైమ్ అంశంపై సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణీందర్ అవగాహన కల్పించగా, లైఫ్ సర్టిఫికెట్ల ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడిగా రిటైర్డ్ ఎస్సై రాములునాయక్, గౌరవ సలహాదారులుగా రిటైర్డ్ ఎస్పీ తాదూరి జనార్దన్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు సంఘం అభివృద్ధి కోసం రాములునాయక్ రూ.లక్ష, రిటైర్డ్ అధికారులు కె.వెంకటేశ్వర్లు రూ.9,500, కె.సోమేశ్వరరావు రూ.6వేల విరాళం ప్రకటించారు. ఈ సమావేశంలో సంఘం బాధ్యులు ఎస్వీ.ప్రతాపరెడ్డి, కె.నర్సయ్య, కర్నాటి సోమయ్య, రంగారావు, ఖాసీం, హరిసింగ్, రామకృష్ణతోపాటు సైబర్ క్రైమ్ ఎస్‌ఐ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్యూమరేటర్లకు శిక్షణ



మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి

ఖమ్మం సహకారనగర్: ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్న ఇంటింటి సర్వే కోసం నియమితులైన ఎన్యూమరేటర్లతో పాటు సూపర్‌వైజర్లకు ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి సర్వే ప్రాధాన్యత, సేకరించిన వివరాలపై దిశానిర్దేశం చేశారు. డీఈఓ ఈ.సోమశేఖరశర్మ, సీఎంఓ యలగందుల రాజశేఖర్, డీఆర్‌పీ, రఘునాథపాలెం ఎంపీడీఓ వి.అశోక్ కుమార్‌తో పాటు అల్లి శ్రావణ్, టి.జీవన్ మాట్లాడగా ఆర్‌ఐలు జ్యోతి, రామారావు, ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజాలక్ష్మి పాల్గొన్నారు.

శభాష్... అంగన్‌వాడీ టీచర్, ఆయా!



ప్రవేశపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న పలువురు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తుండగా ఇక్కడ మాత్రం అంగన్‌వాడీ కేంద్రం టీచర్, ఆయా ఆదర్శంగా నిలిచారు. నేలకొండపల్లి మండలం కట్టుకాచారాంలోని అంగన్‌వాడీ కేంద్రం టీచర్ పి.కుమారి తన మనవరాళ్లు శాలిని, శాన్విని, ఆయా భానుమతి తన పిల్లలు బిందుశ్రీ, బాలాజీని సోమవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరు నచ్చి ఇక్కడ చేర్పించామని తెలిపారు. కాగా, ఈ ఏడాది ప్రైవేట్ పాఠశాలల నుంచి పది మంది విద్యార్థులు తమ పాఠశాలలో చేరారని, ప్రస్తుతం 50గా ఉన్న విద్యార్థుల సంఖ్య వచ్చే ఏడాది 100కు పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు రామదాసు, ఉపాధ్యాయులు ఇటిక్యాల సురేష్, ఎస్.కళ్యాణి పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,100	5,800
మిర్చి	15,500	6,000
మిర్చి తాలు	7,500	7,500
ఏసీ మిర్చి	18,300	9,300
ఏసీ తాలు	9,000	8,400
పత్తి	6,900	5,800

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.19,144

ప్రశ్నార్థకంగా 'కొదుమూరు' ఆయకట్టు

- నిధులు కేటాయించి మరమ్మతు చేస్తేనే లిఫ్ట్‌కు సాగునీరు
- లేకపోతే 2,500 ఎకరాల ఆయకట్టుపై నీలినీడలు..
- రూ.60 లక్షల ప్రతిపాదనలకు లభించని మోక్షం



వీ.వీ.పాలెంలోని వందనం - కొదుమూరు ఎత్తిపోతల పథకం

ఖమ్మంఅర్బన్: ప్రభుత్వం ఇప్పటికప్పుడు నిధులు కేటాయించి మరమ్మతు చేయిస్తే తప్ప కొదుమూరు ఎత్తిపోతల పథకం పరిధిలో ఆయకట్టు భూములకు సాగునీరు అందుతుంది. లేకపోతే పుష్కలంగా నీరు ఉన్నా సుమారు 2,500 ఎకరాల భూముల్లో సాగు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరమ్మతులు చేస్తేనే సాగర్ ప్రధాన కాల్వ నుండి వీ.వీ.పాలెం వద్ద లిఫ్ట్ ద్వారా నీరు ఎత్తిపోసే అవకాశం ఏర్పడుతుంది.

ఏటా నవంబర్ నుంచి మొదలు...

మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలంలో కొదుమూరు, వందనం, రాఘువాపురం, కొణిజర్ల మండలం అమ్మపాలెంతోపాటు ఖమ్మం నగరంలోని పుట్టకోట తదితర ప్రాంతాల పరిధిలో ఆయకట్టుకు నీరు అందించేలా వీ.వీ.పాలెం వద్ద ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటుచేశారు. 2013లో ప్రారంభమైన నిర్మాణ పనులు 2018లో పూర్తికావడంతో ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. ఏటా నవంబర్‌లో ఆరు తడి పంటల సాగు కోసం నీటి విడుదల మొదలుపెట్టి ఏప్రిల్ చివరి వరకు కొనసాగిస్తారు. ప్రారంభం నుంచి కూడా ఆరు నెలలు మాత్రమే ఒక పంట కాలానికి నీరు అందిస్తున్నారని రైతులు చెబుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు, ధ్వంసం

లిఫ్ట్‌కు విద్యుత్ సరఫరా చేసే మూడు ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు రావడమే కాక ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి కాపర్ వైర్ ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన ఇరిగేషన్ అధికారులు ఇటీవలే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, వెంటనే మరమ్మతులు చేయించకపోతే ఈనెలలో నీటి విడుదలపై సంశయం నెలకొనడంతో ఆగమేఘాలపై నిధుల కోసం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించారు. దీంతో ఎప్పుడు అనుమతి లభిస్తుంది.. నిధులు ఎప్పుడొస్తాయి.. మరమ్మతులు పూర్తిచేసి ఎప్పుడు నీరందిస్తారోనని ఆయకట్టు రైతులు ఎదురుచూస్తున్నారు. కాగా, ఎత్తిపోతల వద్ద సీసీ కెమెరాలు లేకపోగా వాచ్‌మెన్‌ను సైతం నియమించకపోవడంతో చోరీ జరిగి తాము నష్టపోయే పరిస్థితి ఎదురైందని అన్నదాతలు వాపోతున్నారు. నీటి విడుదల సమయంలో మాత్రమే ఆయకట్టు రైతులు సూపర్‌వైజర్‌ను ఏర్పాటుచేస్తుండగా రాత్రి తాళం వేస్తారు. అధికారులు త్వరగా మరమ్మతులు చేయించి నీరు విడుదల చేయడమే కాక మరోమారు చోరీలు జరగకుండా వాచ్‌మెన్‌ను నియమించాలని రైతులు కోరుతున్నారు.



ఎత్తిపోతల పథకంలో కాపర్‌వైరు, ఆయిల్ చోరీ అయిన ట్రాన్స్‌ఫార్మర్లు

10వ తేదీకల్లా ఇవ్వకపోతే నష్టమే..



లిఫ్ట్‌కు మరమ్మతులు తక్షణమే చేయించి ఈనెల 10వ తేదీకల్లా నీరు విడుదల చేయకపోతే సీజన్ నష్టపోయే ప్రమాదం ఎదురవుతుంది. చోరీ అయిన సామగ్రికి రూ.25 లక్షలతో పాటు మిగతా పనులకు కలిపి రూ.60 లక్షల అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

– కొండపర్తి గోవిందరావు, ఆయకట్టు చైర్మన్

ప్రతిపాదనలు పంపించాం...

ఎత్తిపోతల పథకం మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సమర్పించాం. నిధులు రాగానే పనులు చేయించి లిఫ్ట్‌ను వినియోగంలోకి తీసుకొస్తాం. తొలినాళ్ల నుంచి మరమ్మతులు జరగకపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లలో వైరు, ఆయిల్ చోరీ జరగడంతో ఈ పరిస్థితి ఎదురైంది.

– రాంప్రసాద్, డీఈ, జలవనరులశాఖ

పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్, పక్కన ఇల్లెందు ఎమ్మెల్యే కనకయ్య

కారేపల్లి: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ పరిధిలో కారేపల్లిలోని శ్రీలక్ష్మి ప్రియ కోటెక్స్ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటుచేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని వైరా, ఇల్లెందు ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్ నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అర్హులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని, ఈ విషయంలో అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. కాగా, సీసీఐ అధికారులు తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బంది పెట్టకుండా మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం కారేపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ చెక్కులు అందజేశారు. వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి నరేష్‌కుమార్, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ రవీంద్రప్రసాద్, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఏఓ అశోక్‌కుమార్, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, తలారి చంద్రప్రకాశ్, అడ్డగోడ ఐలయ్య, సురేందర్ మణియార్, ఇమ్మడి తిరుపతిరావు, పెద్దబోయిన ఉమాశంకర్, మేదరి టోనీ వీరప్రతాప్, దేవ్లానాయక్, బానోతు రామ్మూర్తి, ధరావత్ వినోద్ కుమార్, గుగులోతు భీముడు, ధరావత్ భద్రు నాయక్, ఎండీ.యాకూబ్, హనీఫ్, మేదరి రాజా, షఫీ, షేరు, తాజుద్దీన్, నాగవేణి పాల్గొన్నారు.

మార్కెట్లలోనే పత్తి కొనుగోలు చేయాలి...



మార్కెట్ కార్యాలయం వద్ద ధర్నాలో నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: జిన్నింగ్ మిల్లుల వద్ద కాకుండా వ్యవసాయ మార్కెట్లలోనే సీసీఐ కేంద్రాలు ఏర్పాటుచేసి కొర్రీలు లేకుండా పత్తి కొనుగోలు చేయాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐకేఎస్) రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఏఐకేఎస్ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో అచ్చయ్య మాట్లాడుతూ మిల్లుల్లో ఏర్పాటుచేసిన సీసీఐ కేంద్రాలతో దళారులకు తప్ప రైతులకు లాభం జరగడం లేదన్నారు. సీసీఐ నిబంధనలతో రైతుల నుంచి వ్యాపారులు తక్కువే ధరకు పత్తి కొని ఆపై సీసీఐకి అమ్మి లాభాలు గడిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా మార్కెటలోనే పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో కొనాలని, తేమ 20శాతం ఉన్నా కొనేలా నిబంధనలు మార్చాలని డిమాండ్ చేశారు. ఇంకా మార్కెట్‌లో ఎగుమతి, దిగుమతి, హమాలీ చార్జీలు కమీషన్, ఖరీదుదారులే భరించాలని, కటింగ్ కమీషన్ రెండు శాతం తీసుకోవడంతో పాటు మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, నాయకులు కె.నాగేశ్వరరావు, కోలేటి నాగేశ్వరరావు, పాశం అప్పారావు, కేలోతు లక్ష్మణ్, మారుతి మల్ల య్య, కుర్ర వెంకన్న, ధరావత్ లక్ష్మణ్, వెంకటస్వామి, బి.వెంకయ్య, జిల్లా కార్యదర్శి తిమ్మిడి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే తాళం పగలగొట్టి చోరీ

తిరుమలాయపాలెం: మండలంలోని జూపెడలో పట్టపగలే ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బీరువాలో దాచిన 4తులాల బంగారు ఆభరణాలు, రూ.6 వేల నగదు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన పూజల శ్రీను ఇంటికి తాళం వేసి పనులకు వెళ్లాడు. దుండగులు తాళం పగలగొట్టి బంగారం, నగదు ఎత్తుకెళ్లగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తిరుమలాయపాలెంలో...

తిరుమలాయపాలెంలో పోలీస్‌స్టేషన్‌కి కూతవేటు దూరాన ఇప్పల వెంకటేశ్వర్లు(పటేల్) టీ స్టాల్‌లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. టీ స్టాల్ తాళం పగలగొట్టి రూ.15వేల నగదు, సిగరెట్లు, మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లిన దుండగులు పక్కనే ఉన్న ఎంపీడీఓ కార్యాలయంలో మద్యం తాగారు. అంతేకాక ఎంపీడీఓ కార్యాలయ తాళాలు, సమీపంలోని కొండబాల బాబు ఇంట్లో, మరోచోట కిరాణం షాపు తాళాలు పగలగొట్టే ప్రయత్నించారు. పోలీసుస్టేషన్‌కు చుట్టుపక్కల ప్రాంతంలోనే ఈ ఘటనలు జరగగా బాధితుల ఫిర్యాదుతో పోలీసులు సోమవారం ఉదయం పరిశీలించారు.

ధాన్యం తడవడంతో ఆందోళన



ధాన్యం నేర్పుతున్న దృశ్యం

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండలంలోని గువ్వలగూడెంకు చెందిన రైతు అమరనేని శ్రీనివాసరావు సాగుచేసిన వరి ధాన్యం అకాల వర్షానికి తడిసింది. ఆయన ఎనిమిది ఎకరాల్లో వరిసాగు చేయగా దాదాపు 320 బస్తాల దిగుబడి వచ్చింది. స్థానిక వ్యాపారితో ఒప్పందం కుదుర్చుకోవడంతో ఆదివారం కాంటా వేయించేందుకు వస్తానని చెప్పగా అంతలోనే ఒక్కసారిగా వర్షం రావడంతో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం తడిసింది. దీంతో వ్యాపారి ముఖం చాటేయగా.. చేసేదేం లేక శ్రీనివాసరావు దంపతులు ధాన్యం సోమవారం ఆరబోయడంలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ కేంద్రంలో త్వరగా కొనుగోళ్లు మొదలుపెడితే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని ఆయనతో పాటు పలువురు రైతులు వాపోతున్నారు.

వీధికుక్కల దాడిలో గొర్రెపిల్లల హతం



మృతి చెందిన గొర్రె పిల్లలు

కారేపల్లి: కారేపల్లిలో వీధికుక్కలు బీభత్సం సృష్టించాయి. బొడ్రాయి బజార్‌కు చెందిన రాటోతు లాలయ్యకు చెందిన పది గొర్రె పిల్లలపై దాడి చేసి చంపివేశాయి. ఎప్పటిలాగే గొర్రెపిల్లలను దొడ్డిలో వదిలేసిన లాలయ్య మిగతా జీవాలను సోమవారం ఉదయం మేతకు తీసుకెళ్లాడు. ఆతర్వాత దొడ్డిలోకి ప్రవేశించిన కుక్కలు దాడి చేయడంతో పది పిల్లలు చనిపోయాయి. సాయంత్రం వచ్చాక గుర్తించిన లాలయ్య తనకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరాడు. ఇదిలా ఉండగా బొడ్రాయి బజార్‌లో 20రోజుల క్రితం జంగా మధుకు చెందిన 21 గొర్రెలు, ఈనెల 2న యర్నాగి సతీష్‌కు చెందిన ఏడు గొర్రె పిల్లలను కుక్కలు చంపేయడం, ఇప్పుడు మరో ఘటన జరగడంతో కాపరులు ఆందోళన చెందుతున్నారు.

డీపీఆర్‌సీ భవనంలోకి డీఎల్‌పీఓ కార్యాలయం

ఖమ్మంవన్‌టౌన్: కలెక్టరేట్‌లో కొనసాగుతున్న ఖమ్మం డివిజినల్ పంచాయతీ అధికారి కార్యాలయాన్ని డీపీఆర్‌సీ భవనంలోకి మార్చారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఖమ్మం ఎన్నెస్పీ క్యాంపులోని డీపీఆర్‌సీ భవనంలోకి కార్యాలయాన్ని మార్చామని డీఎల్‌పీఓ రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు నాగుల చవితి

శివాలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

ఖమ్మంగాంధీచౌక్: నాగదేవతను పూజించే నాగుల చవితి పర్వదినాన్ని భక్తులు మంగళవారం జరుపుకోనున్నారు. ఏటా కార్తీక మాసంలో శుద్ధ చతుర్థి రోజున నాగుల చవితి జరుపుకోవడం ఆనవాయితీ. ఈమేరకు ఆలయాలు, ఇతర చోట్ల పుట్టల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేస్తారు. ఈమేరకు శివాలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేకం.. నాగారాధన

నాగులచవితిపై పురాణ గాథలు ఉన్నాయి. పలు ఆలయాల్లో నాగేంద్రుని విగ్రహాలు కనిపిస్తాయి. శివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసంలో నాగేంద్రుడిని పూజిస్తే అంతా మంచే జరుగుతుందని నమ్మిక. ఈ మేరకు ఆలయాల్లోనే నాగేంద్రుడికే కాక శివారు ప్రాంతాల్లో సర్ప నివాసమైన పుట్టల వద్ద పూజలు చేయనున్నారు. ఈసందర్భంగా నానబెట్టిన బియ్యాన్ని పిండి చేసి కొబ్బరి కలిపి చేసే చలిమిడితో పాటు నువ్వులు, బెల్లంతో ముద్దగా కలిపి చేసే చిమ్మిలి, అరటిపండ్లు నైవేద్యంగా సమర్పిస్తారు. కాగా, భూగర్భంలో ఉండే సర్పాలు భూసారాన్ని కాపాడుతాయని, పంటలను నాశనం చేసే క్రిమికీటకాలను తింటూ పరోక్షంగా రైతులకు మేలు చేస్తాయని చెబుతారు.

అగ్నిప్రమాదంలో కాలిబూడిదైన గుడిసె

నేలకొండపల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పూరి గుడిసె కాలిపోగా నిరుపేద కుటుంబం కట్టుబట్టలు మిగిలింది. మండలంలోని మంగ్రాజుపల్లి తండాకు చెందిన పానుగోతు ఉపేందర్ కుటుంబంలో ఎవరూ లేని సమయాన గుడిసెకు సోమవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో నిప్పంటుకోగా స్థానికులు అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అయితే, గుడిసె గుట్టపై ఉండడంతో వాహనం చేరుకోలేకపోయింది. దీంతో గుడిసె పూర్తిగా కాలిపోగా రూ.25 వేల నగదు, రెండు క్వింటాళ్ల బియ్యం, టీవీ, బట్టలు, ఇతర సామగ్రి కాలిపోవడంతో కట్టుబట్టలతో మిగిలిన తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఉపేందర్ కోరాడు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని ధంసలాపురం వద్ద సోమవారం ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. అగ్రహారం కాలనీకి చెందిన రాడ్ బెండింగ్ కార్మికులు బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో కార్మికులు విజయ్, పాషా గాయపడగా, ఆటో సైతం పల్టీ కొట్టడంతో అందులో ఉన్నవారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ మేరకు క్షతగాత్రులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం పైనుండి పడి వ్యక్తి మృతి

కోతులు అడ్డు రావడంతో ప్రమాదం

ఖమ్మంరూరల్: మండలంలోని తరుణి హాట్ సమీపాన ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం పైనుంచి పడిన వ్యక్తి మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం మండలం ఉర్లుగొండకు చెందిన కైరోజు వైకుంఠాచారి(44) తన భార్య ఈశ్వరమ్మతో కలిసి ఆదివారం ఏదులాపురంలో జరుగుతున్న ఫంక్షన్‌కు బయలుదేరాడు. ఈక్రమంలో తరుణీ హాట్ వద్ద కోతుల గుంపు అడ్డు రావడంతో సడెన్ బ్రేక్ వేయగా ఇద్దరు బైక్ పైనుంచి ఎగిరి కింద పడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వైకుంఠాచారిని ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని సీఐ ముష్క రాజు తెలిపారు.

కారు ఢీకొని యువకుడు..

ఖమ్మంరూరల్: మండలంలోని ఎం.వెంకటాయపాలెం వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టడంతో కాచిరాజుగూడెంకు చెందిన పి.సాయికిరణ్(23) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆటో నడుపుతూ జీవనం సాగించే సాయికిరణ్ ఆదివారం బంధువు వద్ద బైక్ తీసుకుని ఖమ్మం బయలుదేరాడు. ఎం.వెంకటాయపాలెం వద్ద ఖమ్మం వైపు నుండి అతి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాలైన ఆయనను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించచగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఘటనపై సాయికిరణ్ తండ్రి పాపయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పాఠశాలల క్రీడా జట్ల ఎంపిక



ఉమ్మడి జిల్లా అండర్-17 రగ్బీ బాలుర జట్టు



పరుగుపందెం ఎంపిక పోటీల దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి అథ్లెటిక్స్, రగ్బీ అండర్-14, 17 జట్లను సోమవారం ఎంపిక చేశారు. జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో జట్లను ఎంపిక చేయగా, ఆయా జట్లు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.నర్సింహామూర్తి తెలిపారు. కాగా, అథ్లెటిక్స్ అండర్-14 బాలబాలికల రాష్ట్రస్థాయి పోటీలు ఖమ్మంలోనే జరగనున్నాయని వెల్లడించారు. ఎంపిక ప్రక్రియలో అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ గౌస్, పీడీలు షఫీక్ అహ్మద్, సుధాకర్, కృష్ణయ్య, జి.సైదేశ్వర్‌రావు, రవికుమార్, ముజాహిద్, నవీద్, శివ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

- **రగ్బీ జట్లు :** అండర్-14 బాలుర జట్టుకు జి.జగన్, కె.రుకిరాజ్, మనోజ్, అశ్రిత్, నందన్, వరుణ్, గణేష్, శ్రీహర్ష, పవన్‌కుమార్, కీర్తన బాబు, రాజేష్, పి.అఖిల్, భానుదీక్షిత్ ఎంపిక కాగా, బాలికల జట్టుకు జెస్సికా, వేదశ్రీ, కృతిక, జ్యోతిక, అఖిల, జలజ, భవాని, అమూల్య, వర్షిత, సౌజన్య ఎంపికయ్యారు. అలాగే, అండర్-17 బాలుర జట్టుకు ఎం.గోపీచంద్, ఎస్. వర్షిత్‌కుమార్, డి.నోము, ఎస్.చరణ్‌సాయి, ఎస్.సింధుకల్యాణ్, ఈ.ప్రశాంత్, టి.ప్రవీణ్, ఎస్.కే.సాజిత్, బి.వీరభద్రం, బాలికల జట్టుకు ఎస్.నందిని, బి.సునీత, పి.హిందు, డి.కావ్య, ఎం.ప్రణీత, ఎస్.వైష్ణవి, బి.సమీరా, సీహెచ్.సంజన, జి.నాన్సీ, వై.జోషిత, జి.శర్వాణి, బి.మానస, బి.కీర్తన ఎంపకియ్యారు.
- **అథ్లెటిక్స్ జట్లు :** అండర్-14 బాలుర జట్టుకు హెచ్.అభి, వి.చరణ్‌గౌడ్, బి.చందులాల్, బి.నరేష్, వి.శవిషకుమార్, ఎల్.అరుణ్, కె.అఖిల్, కె.విజయ్ రాణా, అరవింద్, డి.లోకేష్, ఎం.నితిన్, ఎం.వరుణ్, డి.మోహిత్, ఎల్.సందీప్, బాలికల జట్టుకు వై.శృతిహాసిని, రుధిక, డి.మధుప్రియ, ఎం.మౌశ్రీక, పి.శిరీష, ఎస్.లక్ష్మీప్రియ, బి.ప్రదీక, కె.హన్‌సిత, ఎం.శాంతి, ఎం.భవిత, పి.సాయి స్రవంతి, డి.హారిక, ఎ. తషీకా ఎంపికయ్యారు. ఇక అండర్-17 బాలుర జట్టుకు ఎండీ.అష్రఫ్, సీహెచ్.వినయ్, సీహెచ్.నవదీప్, ఎస్.కే.ముబీన్, వి.రోహిత్, బి.పుల్లయ్యాచారి, వి.సాయి, జి.ప్రవీణ్, ఆర్.ప్రణయ్, ఆర్.సన్నీ, కె.అక్షయ్‌రోహన్, జి.వెంకట్‌సాయి, కె.మస్తాన్, బి.ముఖేష్‌నాయక్, బి.లోకేష్, డి.సాయికుమార్, కె.ఆనంద్, బి.ఈశ్వర్, బి.నాగేంద్రబాబు, బి.విజయ్‌కుమార్, కె.ధనుంజయ్, బాలికల జట్టుకు ఎస్.కే.అఫ్రిన్, బి.దివ్యసాయి, బి.రూప, ఎం.శ్రీవిద్యదొర, డి.చందన, జి.తేజశ్రీ, సీహెచ్.వేదశ్రీ, పి.కరుణ, బి.వాణి, ఎం.భవాని, డి.అమృత, ఎం.సాయిదీపిక, డి.భువనేశ్వరీ, బి.వేదర్షిణి, బి.ప్రసన్న, కె.సబిత, ఎ.మనుశ్రీ, బి.మన్విత, టి.నవీన, బి.ఆశశ్రీ, బి.దుర్గ, వి.వనిత, సీహెచ్.హాసిని ఎంపికయ్యారని వెల్లడించారు.

బాల్‌బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక



పోటీలకు హాజరైన క్రీడాకారులతో పీడీలు

బోనకల్: రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లా పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేసినట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు, క్రీడల ఆర్గనైజర్ అమరేసి లింగయ్య తెలిపారు. ఈనెల 3, 4వ తేదీల్లో బోనకల్ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన పది మంది పురుషులు, పది మంది మహిళలతో జట్లను ఎంపిక చేశామని వెల్లడించారు. ఈ జట్లు 8వ తేదీ నుంచి హనుమకొండలో జరిగే 70వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. కాగా, ఎంపిక పోటీల పరిశీలకుడిగా టి.శేషగిరి వ్యవహరించారు.

గురుకులం వద్ద తల్లిదండ్రుల ఆందోళన

అధ్యాపకులను నియమించాలని డిమాండ్



గిరిజన గురుకులం వద్ద నిరసన తెలుపుతున్న తల్లితండ్రులు

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాల, కాలేజీలో అర్హతలు కలిగిన అధ్యాపకులను నియమించి పిల్లల భవిష్యత్ కాపాడాలంటూ విద్యార్థులు తల్లిదండ్రులు సోమవారం ఆందోళన చేపట్టారు. విద్యార్థులకు ఇంటర్ పాఠాలు బోధిస్తూనే పోటీపరీక్షల్లో సత్తాచాటేలా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసిన ఈ పాఠశాల, కళాశాలలో 381 మంది చదువుతున్నారు. గత ఏడాది వరకు కాంట్రాక్టు ఉపాధ్యాయులే ఉన్నా నీట్, ఐఐటీకి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. అయితే, ఈ ఏడాది రెగ్యులర్ ఉపాధ్యాయులను కేటాయించగా సరైన బోధన అందడం లేదని విద్యార్థుల నుండి ఫిర్యాదులు రావడంతో ఐదు గురు అధ్యాపకులు డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. ఫలితంగా గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధించే వారు లేకపోవడంతో 20 మంది విద్యార్థులు టీసీ తీసుకుని వెళ్లిపోయినట్లు తెలిసింది. ఇక మిగతా పిల్లల తల్లిదండ్రులు సోమవారం ఆందోళనకు దిగడం గమనార్హం. ఈ విషయమై ప్రిన్సిపాల్ బాలస్వామిని వివరణ కోరగా తాను హైదరాబాద్‌లో సమావేశానికి వెళ్లాని, అధ్యాపకుల కొరతపై ఉన్నతాధికారులకు నివేదించానని తెలిపారు. వారం రోజుల్లో కొత్త వారిని నిమించే అవకాశముందని వెల్లడించారు.

ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి



కార్మికోద్యమంపై రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ యూనియన్లపై ఆంక్షలు తొలగించి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్.రావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సీహెచ్‌వీ.రామయ్య స్మారక భవనంలో పగిళ్లపల్లి నరసింహారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఇందులో భాగంగానే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి అన్ని ప్రయోజనాలు వర్తింపచేయాలని కోరారు. ఆతర్వాత ఎస్‌డబ్ల్యూఎఫ్ వ్యవస్థాపకులు మన్నెం నర్సిరెడ్డి రాసిన 40 ఏళ్ల ఉద్యమం, ఉద్యోగ అనుభవాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రంశెట్టి వెంకటేశ్వర్లు, రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంబాబు, పిట్టల సుధాకర్‌తోపాటు పగిళ్లపల్లి నర్సింహారావు, తోకల బాబు, జె.నాగేశ్వరరావు, గుగ్గిళ్ల రోశయ్య, గడ్డం అయోధ్య, నాగమల్లేశ్వరరావు, గణాచారి, వేణు తదితరులు పాల్గొన్నారు.